

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5। కనిష్ఠం 18.4
కామారెడ్డి జిల్లా వార్తలు
5
సోమవారం 28 జూలై 2025



విచ్చల విడిగా.. కడుపు కోతలు



- జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో పెరిగిన సిజేరియన్లు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పలువురు వైద్య సిబ్బంది దురుసు ప్రవర్తన, నిర్లక్ష్య వైద్యం
- మరికొన్ని చోట్ల వసతులు లేక ప్రసవాలకు ప్రైవేట్ ఆసుపత్రుల వైపు మొగ్గు
- దీంతో ఇష్టారీతిన ఆపరేషన్లు
- ప్రభుత్వ అనుమతులు పాటించని ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలు

కామారెడ్డి, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు లేక, సిబ్బంది కొరత, అత్యవసర సమయాల్లో వైద్య సిబ్బంది వ్యవహరించే తీరు వంటివి నచ్చక చాలా మంది ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు వదులుకొని ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని దాదాపు అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు అవసరం లేకున్నా సిజేరియన్లు చేస్తున్నారు. ఇలా చేసి వేలకు వేల రూపాయలు లాగుతూ అక్రమార్జనకు ఒడిగడుతున్నారు. ఈ విధానానికి స్వస్తి చెప్పాలని భావించిన కేంద్ర ప్రభుత్వం గతంలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా ప్రైవేట్ ఆస్పత్రిలో సిజేరియన్ చేయాలంటే అనుమతి ఉండాలనే నిబంధన విధించింది. ఈ నిబంధనను ఏ ఒక్కరూ అమలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో పెరిగిన సిజేరియన్ జరిగిన ప్రసవాల్లో నూటికి 60 శాతం సిజేరియన్‌లు జరుగుతున్నాయి. వచ్చే అడపాదడప ప్రసవాలతో ప్రైవేట్ ఆసుపత్రుల ధనార్జన తగ్గిపోవడం వల్ల సిజేరియన్లకే మొగ్గు చూపుతూ అధికారుల కళ్లు కప్పేందుకు తూతూ మంత్రంగా లపై రివ్యూ నిర్వహించాల్సిన వైద్య ఆరోగ్యశాఖ సైతం గమ్మునుండడంతో వారికి నచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన ప్రసవాలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రూపాయి ఖర్చు లేకుండా ప్రసవం చేస్తుంటే ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రం సిజేరియన్‌ల పేరిట భారీగానే వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గతం లో కంటే మెరుగైన ప్రసవాలు జరుగుతున్నాయి. మొదటి కాన్పుకు ఖచ్చితంగా నార్మల్ డెలివరీ చేయాలనే నిబంధనలను ప్రభుత్వం విధించడంతో అవసరమైతేనే సిజేరియన్‌లు చేస్తున్నారు. అయితే కొంత మంది వైద్య సిబ్బంది దురుసు ప్రవర్తన, నిర్లక్ష్య వైద్యంతో ప్రభుత్వ ఆసుపత్రికి ప్రసవానికి తీసుకువస్తున్నా తిరిగి ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకుపోతున్నారు. ఇలా వచ్చిన వారిని ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు రక్తహీనత, బీపీ ఎక్కువగా ఉందని గర్భంలో శిశువు ఉమ్మి నీరు మింగిందని గర్భిణి కుటుంబీకులను కంగారు పెట్టించి అత్యవసర పరిస్థితుల్లోనే సిజేరియన్ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా సిజేరియన్ చేయాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బాధితులు చేసేదేమి లేక, ఆర్థిక స్థోమత సరిపడకపోయినా దాదాపు 50 నుంచి 70 వేల వరకు చెల్లిస్తున్నారు.

ప్రైవేట్‌లో సిజేరియన్‌లకే ప్రాధాన్యత..

జిల్లాలో గత 3 నెలల కాలంలో జరిగిన ప్రసవాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు ఎక్కువగా జరిగినప్పటికీ ప్రైవేట్ ఆసుపత్రుల్లో

(మిగతా 8వ పేజీలో)





గంగమ్మ వాగు బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

గంగమ్మ వాగు బ్రిడ్జి పనులను పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

రామారెడ్డి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల కేంద్రంలో గంగమ్మ వాగు బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదివారం కలెక్టర్ ఆదేశించారు. శనివారం నీటి ప్రవాహం అధికం కావడంతో తాత్కాలికంగా రాకపోకలను మూసివేశారు. దీంతో ఆదివారం కలెక్టర్ గంగమ్మ వాగు బ్రిడ్జిని పరిశీలించారు. నిర్మాణ పనులపై అధికారులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన వంతెనకు వెంటనే అప్రోచ్ రోడ్లు నిర్మించాలంటూ ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఏఈ రవితేజ, ఏఎంసీ వైస్ చైర్మెన్ అమ్ముల పశుపతి, ఏఎంసీ డైరెక్టర్ ఎండి. రావుఫ్, నాయకులు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, రంగు రవీందర్ గౌడ్, తూర్పు రాజు, బిపేట నర్సింలు, అంబాయి దాసు, ఇసాయిపేట హరీశ్, రవి, తదితరులు పాల్గొన్నారు.



సినారే పురస్కారం అందుకుంటున్న రచయిత శంకర్

శంకర్‌కు సినారే సాహితీ పురస్కారం అందజేత

కామారెడ్డి టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, అధ్యాపకుడు డాక్టర్ శంకర్ సినారే సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్, తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిద్దారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.



వరి నాట్లు వేసేందుకు పక్క జిల్లాకు మహిళా కూలీలు

- ఉదయాన్నే వాహనాల్లో పయనం
- ఒక్కో కూలీకి రూ.8 వందల నుంచి వెయ్యి సంపాదన
- కురుస్తున్న వానలకు కూలీలకు పెరిగిన డిమాండ్

7

ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యేదెన్నడో?

- ఆర్థిక భారం మోయలేక ముందుకు రాని లబ్ధిదారులు
- ఒకేసారి పెద్ద మొత్తంలో ఇళ్లు మంజూరు కావడంతో మేస్త్రీలకు డిమాండ్

7

బాన్సువాడలో ట్రా'ఫికర్'

- ప్రధాన రహదారిపైనే ఇష్టానుసారంగా పార్కింగ్
- సిగ్నల్ వ్యవస్థ ఉన్నా.. ప్రయోజనం సున్నా
- కనీస నియమాలు పాటించని వాహనదారులు





కార్యక్రమంలో మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

- లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లయ్య నాయక్

గాంధారి, జూలై 27(ఆంధ్రజ్యోతి): పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లయ్యనాయక్ అన్నారు. ఆదివారం గాంధారి మండల కేంద్రంలోని మారుతి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాలకు దూరంగా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని లక్ష్యంతో మేమెంతో మాకంత వాటా కావాలనే నినాదంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. లంబాడి భాష గోర్‌బోలిని భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చడం కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఫారెస్ట్ భూములకు పట్టాలు ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎన్నికల మేనిఫేస్టోలో ఎస్‌సీ, ఎస్‌టీ డిక్లరేషన్‌లో గిరిజనులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలిపారు. నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి నిమిత్తం గత ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ రుణాలను విడుదల చేయాలని అన్నారు. రాజీవ్ యువ వికాసం పేరుతో గిరిజన కార్పొరేషన్లను ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్రను తక్షణమే విరమించుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వానికి ఏ అవసరం వచ్చినా ముందుగా లంబాడీల భూములు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. పరిశ్రమ, ఫార్మా పరిశ్రమలు, ప్రాజెక్ట్, రోడ్లు ఏ పని అయినా హైదరాబాద్ చుట్టు పక్కల ఉన్న లంబాడి భూములను గుంజు కుంటున్నారన్నారు. తక్షణమే లంబాడీల భూముల జోలికి రావద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. లంబాడీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. తండాల్లో తీజ్ పండుగ, సీత్ల పండుగ, సేవాలాల్ మహరాజ్ జయంతి లాంటి బంజారా సంస్కృతి, సాంప్రదాయాలు రక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కోటి అన్నయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్‌నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్, రాష్ట్ర కార్యదర్శి వినోద్ నాయక్, జిల్లా అధ్యక్షుడు సూనావత్ గణేష్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాట్రావత్ బధ్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారిలో అత్యధిక వర్షపాతం నమోదు

- 7 సెంటీ మీటర్లు కురిసిన వర్షం
- గత వారం రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు

కామారెడ్డి, జూలై 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజుల నుంచి జిల్లాపై ముసురు నెలకొంది. అయితే ఆదివారం కాస్త ముసురు వర్షం తగ్గింది. గడిచిన 24 గంటల్లో గాంధారిలో అత్యధికంగా వర్షపాతం నమోదయింది. 7 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా 48.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో వాగులు వంకలు వరదతో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, ప్రాజెక్టుల్లోకి వరద వచ్చి చేరుతోంది. నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 1624 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 4.391 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కళ్యాణి రిజర్వాయర్ నిండడంతో రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

బహుజనులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలి

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



అలయ్ బలయ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజనులంతా ఏకమై కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కోరారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణంలో కళాభారతిలో ఆదివారం బహుజన అలయ్ బల య్ నిర్వహించిన కార్యక్రమంలో షబ్బీర్‌అలీ ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడుతూ అబ్ కీ బార్ చార్ సౌ పార్ అన్న బీజేపీ అహంకారాన్ని రాహుల్ గాంధీ పాదయాత్ర ద్వారా అడ్డుకున్నాం అన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి మనువాదాన్ని తీసుకు రావాలనుకుంటున్న కలలు కలలుగానే మిగిలిపోతాయన్నారు. కంచె ఐలయ్య లాంటి మేధావులు ఈరోజు బయటకు వచ్చి రాహుల్ గాంధి నాయకత్వాన్ని సమర్ధిస్తున్నారన్నారు. దేశంలోనే మొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న మన తెలంగాణ రాష్ట్రంలోనే 42 శాతం రిజర్వేషన్ అమలు మొదలు పెడుతున్నామన్నారు.స్థానిక ఎన్నికల్లో మనమందరం ఏకమై కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి సత్తా చాటాలన్నారు. బహుజనులందరూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ గారు రాసిన రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కామారెడ్డి పట్టణంలో నిర్వహిస్తున్న బహుజన అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల హక్కుల కోసం పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్, పెరియార్ రామస్వామి లాంటి మహనుభావుల ఆశయాలను కొనసాగించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ, బాబాసాహెబ్ అంబేద్కర్ సాధించి పెట్టిన హక్కులు రిజర్వేషన్లను నేడు ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రమాదంలోకి నెడుతుందని మండిపడ్డారు. మన హక్కుల కోసం నిలబడి కొట్లాడవలిసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్య, రాజకీయ, సాంఘిక, ఆర్థిక, అసమానతలు రూపుమాపేందుకు బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీల మైన మనమందరం ఒక్కటై కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి మన రాజ్యాంగాన్ని కాపాడుకుందమన్నారు.



బట్టీలు పెట్టి జొన్న పేలాలు తయారు చేస్తున్న దృశ్యం

నాగుల పంచమికి జొన్న పేలాల బట్టీలు సిద్ధం

కామారెడ్డి రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నాగుల పంచమి సందర్భంగా ముందుగానే పల్లెల్లో జొన్న పేలాల బట్టీలు సిద్ధమయ్యాయి. మంగళవారం నాగుల పంచమి పండుగ కావడంతో ప్రజలు జొన్నలను బట్టీలో పట్టించుకోవడానికి బారులు తీరుతున్నారు. ప్రస్తుత కాలంలో ప్రజలు రెడిమేడ్ వస్తువులు, తినుబండారాల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో జొన్న పేలాలు గ్రామాల్లోకి నాలుగు రోజుల ముందుగా అమ్మడానికి వచ్చేవి. కానీ ఇప్పుడు గ్రామాల్లో జొన్న పేలాల బట్టీలు పెట్టినా అం తంత మాత్రంగానే కొనుగులు చేస్తుండడంతో చిరు వ్యాపారులకు నష్టం చేకూరుతుంది.

నిజాంసాగర్‌లో పెరుగుతున్న నీటి మట్టం



కళ్యాణి ప్రాజెక్టు గేట్లు ఎత్తిన దృశ్యం

నిజాంసాగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం నాటికి నిజాంసాగర్ ప్రాజెక్టులో క్రమేపీ స్వల్పంగా సామర్థ్యం పెరుగుతోంది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు రాలేదు. మూడు రోజులుగా నిజాంసాగర్ ఎగువ ప్రాంతం నుంచి స్వల్పంగా వరద నీరు వస్తుండటంతో ఆయకట్టు రైతులు నిజాంసాగర్ నిండేది ఎప్పుడోనని ఆందోళన చెందుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో 1405 అడుగులకు గాను 1390.60 అడుగుల నీటి సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం 17.802 టీఎంసీలకు గాను 4.391 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వర్షాకాలం ప్రారంభంలో నిజాంసాగర్‌లో 6.035 టీఎంసీలు ఉండేది. జూన్ 18 నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా నిజామాబాద్, బోధన్ పట్టణాలకు తాగునీటి అవసరాల కోసం అంటూ అధికారులు నేరుగా నెల రోజుల పాటు రెండు టీఎంసీలు విడుదల చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు ఆశించిన మేరకు లేవు. రైతులు వర్షాకాలాన్ని నమ్ముకుని 1.35 వేల ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారు. ఆయకట్టు కింద వేసిన పంటలు గట్టెక్కాలంటే నిజాంసాగర్ ప్రాజెక్టు నిండాల్సిందేనని రైతులు తెలిపారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమై 45 రోజులు గడుస్తున్నా భారీ వర్షాలు కురియక ప్రాజెక్టులోకి నీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పోచారం ప్రాజెక్టులో 16 అడుగులకు చేరిన నీటి మట్టం

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులో నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 16 అడుగులకు చేరింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని మండలాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా లింగంపేట, గుండారం వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టులో నీటి మట్టం రోజు రోజుకూ పెరుగుతూ వస్తోంది. ప్రాజెక్టులో ఆదివారం సాయంత్రానికి 1800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నట్లు ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఉదయం ప్రాజెక్టులోకి 4,784 ఇన్‌ఫ్లో రాగా, సాయంత్రానికి ఇన్‌ఫ్లో 1800కు తగ్గింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 20.5 అడుగులు (1.820 టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం 16 అడుగులకు (1.110 టీఎంసీలు) చేరింది. ప్రాజెక్టులో నీటి మట్టం గత నాలుగు రోజులుగా రోజు రోజుకూ పెరుగుతుండడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.



పోచారం ప్రాజెక్టులో 16 అడుగులకు చేరిన నీటి మట్టం



నిజాంసాగర్‌లో ప్రస్తుత నీటి మట్టం

కళ్యాణి ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి మండల పరిధిలోని తిమ్మారెడ్డి గ్రామ శివారులో గల కళ్యాణి ప్రాజెక్టులోకి గత నాలుగు రోజులుగా కురిసిన వర్షానికి ఆదివారం ఉదయం 330 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందని నీటి పారుదల శాఖ ఈఈ సలోమన్ ఆదివారం తెలిపారు. కళ్యాణి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 409.50 కాగా ప్రస్తుతం 408.00 నీరు నిల్వ ఉందన్నారు. ఎగువ ప్రాంతం నుంచి నీరు వస్తున్న క్రమంలో ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి 330 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు తెలిపారు. ఇంకా ఎగువన నుంచి నీరు వచ్చే అవకాశం ఉన్నందున్న స్థానికులు చేపల వేటకు వెళ్లరాదని, ఆయకట్టు ప్రాంత రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

భక్తి, శ్రద్ధలతో హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



నందిపేటలోని భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నందిపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి):భక్తిశ్రద్ధలతో హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని లేదంటే అధర్మం పెరిగిపోతుందని ఆర్మూర్ ఎమ్మెల్యేపైడి రాకేష్‌రెడ్డి సూచించారు. ఆదివారం నందిపేట మండల కేంద్రంలోని శ్రీకేదారేశ్వర ఆశ్రమంలో వ్యవస్థాపకులు శ్రీమంగి రాములు మహరాజ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన మండపం నిర్మాణానికి వివిధ ఆశ్రమాల మహరాజ్‌లతో పాటు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ దాదన్నగారి విఠల్ రావులు వేర్వేరుగా భూమి పూజచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ హిందూవులుఐక్యత, బాధ్యతతో మెలిగినప్పుడే దేశం బాగుంటుందని తెలిపారు. హిందూవుగా ఆశ్రమానికి తనవంతు సహయ, సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఆశ్రమాలు ఉండటం హిందూ జాతికి ఎంతో ముఖ్యమని, ధర్మంతో దేవుళ్ళను కొలవాలని, అప్పుడే మనమందరం ఐక్యతతో ఉంటామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిత్యాన్నదానం సత్రం నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి రూ.21లక్షలు మంజూరు చేయిస్తానని హమీ ఇచ్చారు. అంతే కాకుండా ఎల్‌వీ ప్రసాద్ హస్పిటల్ ఆధ్వర్యంలో జరుగుతున్న కంటి పరీక్షల ఖర్చుల నిమిత్తం రూ.లక్ష విరాళంగా ఇస్తున్నట్లు వినయ్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి మాజీ చైర్మెన్ దాన్నగారి విఠల్ రావు, వివిధ పార్టీల నాయకులు, స్వామీజీలు, భక్తులు తదితరులు ఉన్నారు.

వృద్ధులను ఆదరించి గౌరవించాలి: ఏసీపీ



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వృద్దులను ఆధరించి గౌరవించాలని వృద్దాప్యంలో కుటుంబ సభ్యులు తోడు నీడగా నిలవాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మామిడిపల్లి లో సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో వృద్దులకు చేతికర్రలు, గుర్తింపు కార్డులు అందజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు మామిడిపల్లిలో భవనాన్ని ఏర్పర్చుకోవడం అభినందనీయమన్నారు. ఈ వయస్సులో వారు ఏదో వ్యాధితో బాధపడుతుంటారని కుటుంబ సభ్యులు సరిగా చూడకుండా ఇబ్బందులకు గురిచేస్తే డయాల్ 100కుఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్యాల పోశెట్టి, రాంమూర్తి, ఫోరం కార్యదర్శి వెల్మల నడ్పిమలయ్య, కోశాధికారి లక్కారం పోశెట్టి, ఆర్మూర్ సినీయర్ సిటిజన్ అధ్యక్షుడు దొండి నారాయణ వర్మ, కార్యదర్శి గంగాధర్, జిందం నరహరి పాల్గొన్నారు.

పట్టణ పద్మశాలి సంఘ నూతన కార్యవర్గం

ఆర్మూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్‌లోని 8 తర్పల పద్మశాలి సంఘాలతో ఏర్పడిన పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక మోహన్‌దాస్, ప్రధాన కార్యదర్శిగా కొక్కుల రమాకాంత్, కోశాధికారిగా బత్తుల భాస్కర్, సర్వసమాజ్ ప్రతినిధిగా కొక్కుల విద్యాసాగర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మోహన్‌దాస్ మాట్లాడుతూ పద్మశాలి కుల బాంధవుల సంక్షేమం కోసం పాటుపడతామని, నిర్మాణంలో ఉన్న కమ్యూనిటి భవనం పనులు పూర్తి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ త్రివేణి గంగాధర్, చిట్ల ప్రకాష్, హరిచరణ్, చౌకే లింగం, అంబల్లా శ్రీనివాస్, అనంత్‌రావు, యఘ్నేష్, సైబ సుధాకర్, రుద్ర రాజేశ్వర్, రేగుల్ల ప్రకాష్, దాసరి సునీల్ పాల్గొన్నారు.

నవీపేటలో 55.6 మి.మీ. వర్షపాతం

నవీపేట,జూలై27(ఆంధ్రజ్యోతి): నవీపేట మండలంలో ఆదివారం 55.6 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసినట్లు నమోదైందని అధికారులు తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని నాళేశ్వర్‌లోని పటేల్ చెరువు, కమలాపూర్‌లోని కొచ్చెరువు పూర్తిగా నిండి మత్తడి పోస్తుందని అధికారులు పేర్కొన్నారు. మండలంలో 91చెరువులు ఉండగా సగానికి పైగా చెరువులలోకి భారీగా నీటి ప్రవాహం పెరిగింది.

క్రైం సమాచారం

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి



చాంద్‌పాషా(ఫైల్)

భిక్కనూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లుపలి తండాకు చెందిన చాంద్ పాషా(28) గజ్వేల్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్థులు ఆదివారం తెలిపారు. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన చాంద్‌పాషా 20 రోజుల క్రితం గల్ఫ్ దేశం నుంచి రాగా వ్యక్తిగత పనినిమిత్తం గజ్వేల్‌కు బైక్‌పై వెళ్తుండగా అదేవైపు వెళ్తున్న క్రేన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా అర్ధరాత్రి మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు గజ్వేల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోస్టుమార్టం చేసేది లేదని కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు బీష్మించు కు కూర్చున్నారు. చాంద్‌పాషా మృతితో గ్రామంలో విషాధచాయలు నెలకొన్నాయి. మృతుడికి తల్లిదండ్రులు సైదబీ, చిన్న సిలాబ్, సోదరుడు బాబా ఉన్నారు.

పొతంగల్‌లో కంకర లారీ బోల్తా



పొతంగల్ చెక్‌పోస్టు వద్ద బోల్తా పడిన కంకర లారీ

కోటగిరి,జూలై27(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద ఆదివారం ప్రమాదవశాత్తు అదుపు తప్పి కంకర లారీ బోల్తా పడింది. బీర్కూర్ మండలం నుంచి కంకర నింపుకుని కోటగిరి మండలం ఎత్తొండ వైపు వస్తున్న కంకర లారీ పొతంగల్ చెక్‌పోస్టు వద్ద మలుపు తిరిగే క్రమంలో ప్రమాదవశాత్తు లారీ అదుపు తప్పింది. ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీకొట్టడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో రెండు గంటల పాటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పెను ప్రమాదం తప్పడంతో అంత ఊపిరి పీల్చుకున్నారు.

ఉద్యోగులు, రైతులు ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివారు

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న ఇల్తెపు శంకర్ దంపతులు

ఎడపల్లి, జూలై27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, రైతులు ప్రభుత్వానికి రెండుకళ్ల లాంటి వారని వారిలో ఎవరు లేకున్నా ప్రభుత్వం ఇబ్బందులు పడుతుందని బోధన్ ఎమ్మెల్యేసుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎడపల్లి మండల కేంద్రంలోని సరయు ఫంక్షన్ హాలులోఏర్పాటు చేసిన పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షులు ఇల్తెపు శంకర్ స్వచ్ఛంద పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే ఉపాధ్యాయులు వారికి విద్యాబుద్దులు నేర్పి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది దేశ అభివృద్ధికి పాటు పడుతారన్నారు. ఇల్తెపు శంకర్ దాదాపు నలభై సంవత్సరాలపాటు ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంది విద్యార్థులకు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూనే ఎన్నో సమాజసేవా కార్యక్రమాల్లో పాల్గొని సామాజానికి ఎంతో సేవ చేశారని ఆయన కొనియాడారు. స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసినా సమాజసేవను కొనసాగించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం ఇల్తెపు శంకర్ మాట్లాడుతూ దాదాపు 40 సంవత్సరాలుగా పలు పాఠశాలలో పని చేసి నేడు స్వచ్ఛందంగా పదవీ విరమణ పొందడం బాధగా ఉందన్నారు. ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదన్నారు. నేను ఈనలభై ఏళ్లపాటు నా ఉపాధ్యాయ వృత్తిలో నాతోటి ఉపాధ్యాయులకు గాని ఎవరికైనా నావల్ల ఇబ్బంది కలిగితే నన్ను క్షమించాలన్నారు. ఉద్యోగ సమయంలో నాకు ఎల్లపుడూ నా కష్ట సుఖాలకు తోడుగా ఉన్న నాభార్యకు ప్రత్యేక దన్యావాదాలు అన్నారు. నా వృత్తిలో ఒడిదుడుకుల సమయంలో నాకు సహకరించిన నా అన్నదమ్ములకు, కుటుంబీకులకు, సహ ఉద్యోగులకు ప్రత్యేకంగా దన్యావాదాలు తెలిపారు. అనందరం ఆయనను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు దాదన్నగారి విఠల్ రావు, కామారెడ్డి జిల్లా కుషాల్, జిల్లా ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

చిరుత పులి పాదముద్రల పరిశీలన



సిరన్‌పల్లి శివారులో చిరుత పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

నవీపేట,జూలై27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరన్‌పల్లి శివారులో ఆదివారం చిరుత పులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు పరిశీలించారు. ఇటీవల గ్రామ శివారులో చిరుత పులి సంచరించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆదివారం గ్రామ శివారులో ఉన్న మామిడి తోట వద్ద చిరుత పులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు పరిశీలించారు. చిరుత పులికి సుమారు రెండు సంవత్సరాల వయసు ఉంటుందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. చిరుత పులి సంచరించే ప్రాంతానికి ఎవరు వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు సూచించారు. సిరన్‌పల్లి గ్రామాన్ని సందర్శించిన వారిలో అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ జహూర్, బీట్ ఆఫీసర్ సుధీర్‌లు ఉన్నారు.

ఆగస్టు 5న జెండా జాతర

ఆర్మూర్‌టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్ద బజార్ జెండా బాలాజీ మందిరంలో ఆగస్టు 5న జెండా జాతర నిర్వహిస్తున్నట్లు సర్వసమాజ్ అధ్యక్షుడు కొట్టాల సుమన్, కార్యదర్శి పడాల్ దినేష్‌లు తెలిపారు. ఆదివారం జెండా బాలాజీ మందిరంలో జెండా కట్టెకు పూజలు నిర్వహించి జెండా బాలాజీ మందిరం నుండి కింది బజార్, గోల్‌బంగ్లా మీదుగా జంబిహనుమాన్ ఆలయానికి జెండాను తీసుకు వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోల్ బంగ్లా, పెద్దబజార్ మీదుగా జెండా బాలాజీ మందిరంలో జెండాను ప్రతిష్టించారు. 9 రోజులు పూజలు అందుకుని జాతర నిర్వహించిన అనంతరం జాతరను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో జెండా బాలాజీ మందిర పూజారులు మధుకశర్మ, మనోహర్ శర్మ, సర్వసమాజ్ సభ్యులు, కులసంఘాల పెద్దమనుషులు, అధ్యక్ష కార్యదర్శులు , ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

నల్లగుట్ట, గన్యాతండాలో ఘనంగా తీజ్



జక్రాన్‌పల్లి మండలం నల్లగుట్ట తండాలో తీజ్ పండుగ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

జక్రాన్‌పల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్ట తండా, గన్యాతండా గ్రామాల్లో ఆదివారం తీజ్‌పండుగ వేడుకలను ఇరు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.గతకొన్నేళ్ల నుంచివస్తున్న సాంప్రదాయ ప్రకారం పెళ్లికాని యువతులు గోదుల మొలక బుట్టలను ఎత్తు కున్నారు. ఇరు గ్రామాల్లో యువతులు గోధుమ బుట్టలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం స్థానిక చెరువులో గోధుమబుట్టమొలకలను నిజామజ్జనం చేశారు. పెళ్లికాని యువతులు గోధుమ మొలక బుట్టలను ఎత్తుకుని తీజ్ పండుగ ఉత్సవాల్లో పాల్గొంటే మంచి భర్త వస్తాడని వారి నమ్మకం. తీజ్ పండగ పాటలు పాడుకుంటు, నృత్యాలు చేస్తు ఈ తీజ్ పండుగ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బంజార బేరి జిల్లా అధ్యక్షుడు సంతోష్‌నాయక్, శీను నాయక్, మెహన్ నాయ్, తాండా పెద్దలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ



లబ్దిదారులకు రేషన్ కార్డులు అందజేస్తు దృశ్యం

రెంజల్,జూలై27(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండల కేంద్రానికి చెందిన లబ్దిదారులకు నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను స్థానిక కాంగ్రెస్ నాయకులు సాయిబాబా గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్మె శ్రీను ఆధ్వర్యంలో రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా అర్హులకు రేషన్ కార్డులు అందలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన రేషన్ కార్డులే ఉన్నాయని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల రేషన్ కార్డులు అందించలేదన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే రేషన్ కార్డులు వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గైని కిరణ్, కాంగ్రెస్ పార్టీ మహిళ మండల అధ్యక్షురాలు ఇందిరా రెడ్డి, అసాని అనిల్, శివ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పాలెంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఏఎంసీ చైర్మన్

మోర్తాడ్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం గ్రామంలో నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణం పూర్త యితే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుం దని అన్నారు. భవన నిర్మాణానికి బాల్కొండ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ నిదులు మంజూరు చేయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు బక్కురి ఆనంద్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు మహిపాల్, రంజిత్, నవీన్, స్థానిక నాయకులు ఏనుగు మోహన్, బ్రహ్మానాయుడు, రవిశంకర్, రాజన్న, నరేష్, గ్రామ కమిటి సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు, పురోహితులు రంజిత్ శర్మ పాల్గొన్నారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్

మోర్తాడ్,జూలై 27(ఆంధ్రజ్యోతి):మం డల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో కళాశాల పరిధిలో సీఈసీ గ్రూప్‌లో మిగిలి ఉన్న సీట్లను భర్తీచేయ డం జరుగుతుందని ప్రత్యేకాధికారి స్వప్న తెలిపారు. ఈఅవకాశాన్ని అందరు సద్వినియోగ పర్చుకోవాలని కోరారు. ఒరిజినల్ సర్టిఫికెట్ తీసుకొని స్పాట్ అడ్మిషన్‌కు రావాలని కోరారు.

చలో కలెక్టరేట్ జయప్రదం చేయండి

రుద్రూరు,జూలై27(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన నెలకు రూ.10వేలు వేతనం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రుద్రూర్ మండల కేంద్రంలో మాట్లాడారు. రూ.10వేలు వేతనంతో పాటు నాలుగు నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఈ నెల 28న సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 1గంటలకు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపట్టామని జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రవీందర్, మధ్యాహ్న భోజన కార్మికులు సాయిలు, లక్ష్మీ, అల్మాస్, రవి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఆలూర్ మండల తహసీల్దార్ రమేష్

ఆలూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ మండలంలో, మండలానికి సంబందించిన పరిసరా గ్రామాలలో వర్షపాతం అధికంగా ఉండడం వల్ల వాగులు కాలువలు ఉధృతంగా ప్రవహించే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులకు కూడా ఇంటి వద్దనే ఉంచుకోవాలని బయటకు పంపితే ఉరుములు, మెరుపులతో ప్రమాదం పొంచి ఉందని, కరెంట్ పోల్స్ విద్యుత్ తీగల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇళ్లు కూలే పరిస్థితి ఉంటే అధికారులను సంప్రదించాలని వారికి పునరావాస కేంద్రాలు కల్పిస్తామని తెలిపారు. అత్యవసరమైన పరిస్థితులు వస్తే తప్ప ప్రజలు బయటకు వెళ్ళవద్దని సూచించారు.

'రైల్వేలైన్‌లకు నిధులు కేటాయించాలి'



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

ఆర్మూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైల్వేలైన్‌లకు నిధులు కేటాయించి పనులు వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. ఆర్మూర్ పట్టణంలో సీపీఎం ఆర్మూర్ పట్టణంలో సీపీఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నప్పటికీ పత్రిక ప్రకటనలకే పరిమితం అయ్యారు తప్పా కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా పనులు వేగవంతం చేయాలన్నారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఎన్నికల సందర్భంగా ధర్మపురి అర్వింద్ హామీ ఇచ్చారని ఇప్పటి వరకు దాని ఊసే లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, కుతాడి ఎల్లయ్య, కొండ గంగాధర్, నాగరాజు, జక్కం సుజాత, ఓంకార్, కుల్దీర్ శర్మ, రాజు పాల్గొన్నారు.

దోమకొండ కుంటలో ఇద్దరి గల్లంతు

●ఒకరి మృతదేహం లభ్యం ● మరొకరి కోసం గాలింపు



లభ్యమైన శివాని మృతదేహం

దోమకొండ, జూలై27 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఉన్నటువంటి కుంటలో రెండు మృతదేహాలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై స్రవంతి ఆధ్వర్యంలో పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. సాయంత్రం ఇద్దరు మహిళలు కుంట వద్ద బట్టలు ఉతకడానికి వెళ్ళినట్లు సమాచారం. ప్రమాదవశాత్తు ఇద్దరూ కుంటలో పడిపోవడంతో శివాని (22)అనే మహిళ మృతదేహం నీటి పైకి తేలడంతో ఆమెను బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. మరో మృతదేహం అందులో ఉందా లేదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా వారు ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన గుడిసెలు వేసుకొని చిత్తు కాగితాలను, పాత ప్లాస్టిక్ బాటిల్లను మూట కట్టుకొని ఉంటున్నారని సమాచారం. ఈ విషయమై ఎస్సై స్రవంతిని వివరణ కోరగా కుంటలో నుంచి ఒక బాడీ తీరడంతో పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించడం జరిగిందని ఆమె తెలిపారు.

పురాణిపేట్‌లో వైద్య శిబిరం



పురాణిపేట్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

భీమ్‌గల్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురాణిపేట్ గ్రామంలో ఆదివారం శ్రీ శివసాయి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వందమంది చిన్న పిల్లలకు , సుమారు నాలుగు వందల పెద్దలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ఉదయం ఎనిమిది గంటలకు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ పి.సాయికుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ భీమ్‌గల్ లో ఆసుపత్రి ప్రారంభించి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆరవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. వైద్యులు సూర్యనారాయణ, జైపాల్, ప్రదీప్తి, అనిల్, గ్రామాభివృద్ది కమిటీ సభ్యులు సుంకరి నడిపి గంగాధర్, శ్రీరామ్, బానుచందర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో శ్రమదానం



ముళ్ల పొదలు తొలగిస్తున్న సంస్థ సభ్యులు

ఆర్మూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఆలయ ఆవరణ, పరిసరాల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ప్లాస్టిక్, క్యారీబ్యాగ్‌ల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు లక్ష్మీలావణ్య, శంకర్, రాజన్న, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, మధుసుదన్, గణేష్, రవీందర్, కృషివర్ధన్, నరేందర్, శ్యాం సుందర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



దేవాచారిని సన్మానిస్తున్న దృశ్యం

వేల్పూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన వేల్పూర్ మండలం సంతోషి మాత కాలనీ ప్రభుత్వ పాఠశాల కు చెందిన దేవాచారిని నిజామాబాద్ బస్వాగార్డెన్‌లో సన్మానించారు. టీపీయూఎస్ ఆధ్వర్యంలో వ్యాసపూర్ణిమ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలోని 32 మండలాల నుంచి ఒక్కో మండలం నుంచి ఒక ఉపాధ్యా యుడిని చొప్పున ఎంపిక చేశారు. అందులో వేల్పూర్‌కు చెందిన సంతోష్ మాత కాలనీ ప్రభుత్వ పాఠశాలకు చెందిన దేవచారి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను శాలువ మెమెంట్‌తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు కే.రవిచందర్, కార్యదర్శి అజ య్, తపస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భీమ్‌గల్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహత్‌నగర్‌లో ఇటీ వల విద్యుత్ షాక్‌తో మృతిచెందిన రైతు ధారవత్ రామ్‌సింగ్ కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పరామర్శించారు. మృతికి గల వివరాలను తెలుసుకుని ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొదిరె స్వామి, జేజే నర్సయ్య, కుంట రమేష్, అనంత్‌రావు, నాగేంద్రబాబు, సుంకరి సురేష్, గోపాల్ నాయక్, రాజు పాల్గొన్నారు.

బంజార నాయకులకు సన్మానం



స్వాగతం పలుకుతున్న బంజార నాయకులు

జక్రాన్‌పల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజార సేవక్ సంగ్ జాతీ అధ్యక్షుడు ఉమేష్‌యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్‌కు ఆదివారం బంజారా బేరీ జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌లో జరిగే సమావేశానికి వస్తున్న ఉమేష్‌యాదవ్, రాములు నాయక్‌కు డిచ్‌పల్లి టోల్‌గేట్ వద్ద బంజార బేరి జిల్లా అధ్యక్షుడ సంతోష్ నాయక్, మోతీలాల్ నాయక్ కలిసి వారికి స్వాగతం పలికారు. అనంతరం వారిని శాలువ, మెమెంటుతో సత్కరించారు.

ఆర్మూర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆర్మూర్ టౌన్, జూలై 27 (ఆంధ్ర జ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2013-14 సంవత్సరపు పదవ తరగతి విదార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఉల్లాసంగా గడిపారు.పాఠశాలకు తమవంతుగా సీసీ కెమెరాలతో పాటు వైఫైని సమకూర్చడానికి ముదుకు వచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హరిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గణేష్, కోకిల నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, ఆశ్వక్‌మొహమాద్, విజయ్‌ప్రకాష్, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, శ్రీదేవి, అపర్ణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బాన్సువాడలో ట్రా'ఫికర్'

- ప్రధాన రహదారిపైనే ఇష్టానుసారంగా పార్కింగ్
- సిగ్నల్ వ్యవస్థ ఉన్నా.. ప్రయోజనం సున్నా
- కనీస నియమాలు పాటించని వాహనదారులు
- పోలీసులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు



బాన్సువాడ ప్రధాన రహదారిపై వాహనాలను నిర్లక్ష్యంగా నడపడంతో కూలిన డివైడర్

బాన్సువాడటౌన్ , జూలై 27(ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ పట్టణ ప్రజలకు ట్రా...ఫికర్ పట్టుకుంది. ప్రధాన రహదారి మొదలుకొని గల్లీల్లో చూసినా ట్రాఫిక్ సమస్య తలెత్తుంది. దీనికి గల కారణం కేవలం వాహనదారులు ఇష్టారీతిన తమతమ వాహనాలను పార్కింగ్ చేయడమేనని స్థానికులు పేర్కొంటున్నారు. వాస్తవానికి అప్పటి స్పీకర్ , ప్రస్తుత ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక కృషితో బాన్సువాడ పట్టణ రహదారులు, కాలనీ దారులు విశాలంగా మారాయి. బాన్సువాడ - కామారెడ్డి, బాన్సువాడ - బోధన్ రహదారులు డివైడర్ ఏర్పాటుతో పాటు వాహనాల పార్కింగ్ కోసం అధికారులు ఎల్లో మార్కింగ్ కూడా చేసి ఉంచారు. కానీ వాహనదారులు కనీస నిబంధనలు పాటించకపోవడం , వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేయడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు మరింత జఠిలమవుతోంది.

బ్యాంకుల వద్దే అధిక ట్రాఫిక్ సమస్య

బాన్సువాడ పట్టణంలో ప్రధానంగా బ్యాంకుల వద్దే ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. బాన్సువాడ - కామారెడ్డి రహదారిలో ఎస్‌బీఐ బ్యాంకు , బాన్సువాడ - తాడ్కోల్ రోడ్డు ఎస్‌బీఐ బ్యాంకు మరో బ్రాంచి , బాన్సువాడ - పాతబాన్సువాడ రోడ్డులో యూనియన్ బ్యాంకు , హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులున్నాయి. ఈ బ్యాంకులలో లావాదేవీలు జరిపేందుకు విచ్చేసిన ఖాతాదారులు తమతమ వాహనాలను క్రమంలో పార్కింగ్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బాన్సువాడ - కామారెడ్డి ప్రధాన రహదారి సగం వరకు వాహనాలతో నిండిపోగా ఇతర హనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అదేవిధంగా పాతబాన్సువాడ రోడ్డులో కూడా వాహనాలను



రెడ్‌సిగ్నల్ ఉన్నా వాహనాల రాకపోకలు ఇలా

సగం రోడ్డు వరకు వాహనదారులు పార్కింగ్ చేస్తున్నారు. మరోవైపు బస్టాండ్ వెనకాల గల ఎన్జీవోస్ కాలనీ వెళ్లే దారిలో సైతం వాహనాల పార్కింగ్ తలనొప్పిగా మారుతోంది.

కనీస నియమాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి..

కనీస నియమాలను పాటించకుండా ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న వారిపై సంభందిత పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రతీ రోజు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని , ఇష్టారీతిన పార్కింగ్ చేసిన వాహనదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. అంతేకాకుండా బ్యాంకుల వద్ద వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేయకుండా అవగాహన కల్పించాలన్నారు.

సిగ్నల్ వ్యవస్థ ఉన్నా.. ప్రయోజనం సున్నా!

బాన్సువాడ పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు అధికారులు సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు రెడ్ సిగ్నల్ ఉన్నా కూడా యధేచ్చగా సిగ్నల్ జంప్ చేస్తున్నారు. ఫలితంగా ఇతర మార్గాల వైపు వెళ్లే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బాన్సువాడ బస్టాండ్ ప్రాంతంతో పాటు తాడ్కోల్ చౌరస్తాలో కూడా సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని , ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు.

ఫ్రీ లెఫ్ట్‌కు దారేది ..?

బాన్సువాడ బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు అధికారులు ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి నుంచి పాతబాన్సువాడ వైపుకు వెళ్లాలంటే ఫ్రీ లెఫ్ట్‌కు దారిలేకుండా పోయింది. ఎడమ వైపుకు వెళ్లాలంటే గ్రీన్‌సిగ్నల్ పడేంత వరకు వేచి చూడాల్సిందే. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు , ప్రజలు కోరుతున్నారు.

వరి నాట్లు వేసేందుకు పక్క జిల్లాకు మహిళా కూలీలు

- ఉదయాన్నే వాహనాల్లో పయనం
- ఒక్కో కూలీకి రూ.800 నుంచి వెయ్యి సంపాదన
- కురుస్తున్న వానలకు కూలీలకు పెరిగిన డిమాండ్



పొలంలో నాటు వేస్తున్న మహిళా కూలీలు

పెద్దకొడప్‌గల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గత పక్షం రోజుల వరకు వానలు కురియకపోవడంతో వ్యవసాయ పనులు నిదానంగా సాగాయి. నీటి లభ్యత కలిగిన ప్రాంతాలలోనే పనులు ఉండటంతో కూలీలకు పనులు అంతంత మాత్రంగానే ఉండేవి. అయితే గత నాలుగైదు రోజుల నుంచి వానలు కురియడంతో కూలీలకు ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడింది. దీంతో వరినాట్లు వేసేందుకు మహిళా కూలీలకు ఎక్కడ లేని డిమాండ్ ఏర్పడింది. కామారెడ్డి సంగారెడ్డి జిల్లాకు సరిహద్దులో ఉండటంతో మహిళా కూలీలకు నాట్లు వేసేందుకు మన జిల్లా రైతులతో పాటు సంగారెడ్డి జిల్లా రైతుల నుంచి పిలుపు రావడంతో మహిళలు నాట్లు వేసేందుకు కామారెడ్డి జిల్లా గ్రామాలతో పాటు, పక్కనున్న సంగారెడ్డి జిల్లా గ్రామాలకు వెల్తున్నారు. ఉదయం వివిధ రకాల వాహనాలలో పనులకు వెల్లి రాత్రి ఇంటికి చేరుకుంటున్నారు.

గుత్తగా కూలీ పనులతో ఆదాయం..

మామాలు సమయంలో అయితే మహిళా కూలీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలీ పనిచేస్తే సుమారుగా 3 వందల నుండి 4 వందల వరకు కూలీ చెల్లిస్తారు. ప్రస్తుతం కూలీలకు డిమాండ్ ఉండటంతో వరి నాటు పనులను గుత్తాగా చేస్తున్నారు. ఎకరాకు 4500 నుండి 5 వేల రూపాయలు తీసుకుని వరి నాట్లు వేస్తున్నారు. దీంతో 15 మంది మహిళ కూలీలు రోజంతా 3 నుండి 4 ఎకరాల వరకు వేయడంతో ఆటో కిరాయి పోను ఒక్కోక్కరికి సుమారుగా 8 వందల నుండి 1 వెయ్యి రూపాయల వరకు కూలీ గిట్టుబాటు అవుతుందని కూలీలు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేస్తేనే కూలీ బాగా వస్తుందని తెలిపారు.



నాటు వేసేందుకు ఆటోలో వెళ్తున్న కూలీలు

మొన్నటి వరకు పక్క జిల్లాలోనే పనులు..

గత వారం రోజుల కిందట వరకు నాట్లు వేసే పనుల కోసం కూలీలు ఉదయాన్నే సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలతో పాటు, నారాయణ ఖేడ్, సిర్గాపూర్, కంగ్టి మండలాలకు వెల్లేవారు. మన జిల్లాలో సరియైన వర్షం లేకపోవడంతో పక్క జిల్లాకు పనుల కోసం ఆటోలలో వెల్లారు, ప్రస్తుతం వానలు కురస్తుండటంతో మన జిల్లాలోనే పనులు దొరుకుతున్నట్లు కూలీలు తెలిపారు. గతంలో కంటే మన జిల్లాలోనే పనులు దొరుకుతుండటంతో ఇతర జిల్లాకు వెల్లడం లేదని తెలిపారు. వానలు లేక వరినాట్లు ఇంకా జోరుగా సాగడం లేదని మరిన్ని వర్షాలు కురిస్తే తమకు నెల రోజుల పాటు ఉపాధి లభిస్తుందని కూలీలు తెలిపారు.

నాట్లు వేసేందుకు సంగారెడ్డి జిల్లాకు వెళుతున్నాం

లల్లిబాయి, రూం తండా..



మేము గత కొద్ది రోజుల నుంచి వరినాట్లు వేసేందుకు సంగారెడ్డి జిల్లాకు వెలుతున్నాం. మన జిల్లాలో సరైన వర్షాలు లేని కారణంగా పక్క జిల్లాలో నీరు లభ్యత ఉన్న ప్రాంతాల్లో నాట్లువేసేందుకు వెళ్తున్నాం. ఉదయాన్నే 6 గంటలకు ఇంటి నుంచి బయలు దేరి పనులకు వెళ్తున్నాం. ఉదయం నుంచి రాత్రి వరకు నాట్లు వేసే పనిని గు త్తగా చేయడంతో కూలీ సుమారుగా వెయ్యి వరకు వస్తుంది. ఆటో కిరాయి పోను మాకు కూలీ మిగులుతుంది.

ఇక్కడ పనులు లేక పక్క జిల్లాకు పనులకు వెళ్లాం..

శారదా బాయి, రూం తండా



మన జిల్లాలో పనులు లేని కారణంగా పక్క జిల్లాకు పనులకు వెళ్లాం. గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మన జిల్లాలోనే పనులు దొరుకుతున్నాయన్నా నమ్మకం కల్గింది. భారీ వర్షాలు కురిస్తే మన జిల్లాలోనే ఇంక వరి నాట్లు పనులు నెల వరకు సాగుతాయి. దీంతో మాకు ఉపాధి లభిస్తుంది. మంచి వర్షాలు కురియాలని కో రుకుంటున్నారు.

వీధి శునకం.. ప్రజలకు నరకం

- రుద్రూరు మండలంలో కుక్కల స్వైరవిహారం
- కానరాని నియంత్రణ చర్యలు
- ప్రజలపై కుక్కల దాడి



వీధి కుక్కల దాడిలో గాయపడిన వ్యక్తి

రుద్రూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో రోడ్లమీద ఎక్కడ పడితే అక్కడ సంచరిస్తూ గ్రామస్థులపై దాడులకు దిగుతున్నాయి. గ్రామస్థులు భయాందోళనలకు గురవుతూ ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఆసుపత్రుల్లో కుక్కకాటుకు బాధితులు నానాటికి ఎక్కువుతున్నారు. వీధి కుక్కలకు నిబంధనల ప్రకారం కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయడం, టీకాలు వేయాల్సి ఉన్న ఆ చర్యలు కనపడడం లేదు. రుద్రూరు మండలంలోని 10 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత ఏడాది వ్యవధిలోని దాదాపు 60మంది కుక్కకాటుకు గురయ్యారంటే గ్రామాల్లో కుక్కల బెడద ఏ స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రుద్రూర్ మండల కేంద్రంలోని దాదాపుగా 20మంది కుక్కకాటుకు గురయ్యారు. అంబం(ఆర్)02, సులేమాన్ ఫారం 05తో పాటు రాణంపల్లి, అక్బర్‌నగర్, బొప్పాపూర్, చిక్కడ్‌పల్లి గ్రామాల్లో కుక్కకాటుకు గురయ్యారు. రుద్రూర్‌లో గతంలో పిచ్చికుక్క ఏడుగురు వ్యక్తులను కరిచింది. దీంతో పాటు పశువులపై కూడా దాడి చేసింది. సోమవారం రుద్రూర్ మండల కేంద్రంకు చెందిన ఓ వ్యక్తికి కుక్కకాటు వేసింది. దీంతో కుక్కకాటుకు గురైన బాధితులు గగ్గోలు పెడుతున్నారు. నడుచుకుంటూ వెళ్లే వ్యక్తులపై కూడా వెనకాల నుండి వచ్చి కుక్కలు దాడి చేయడంతో ప్రజలు జంకుతున్నారు. అంబం(ఆర్) గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో కలిసి తిరుగుతున్నాయి. ఒంటరిగా ఎవరైనా కనబడితే చాలు దాడులు చేస్తున్నాయి. గతంలో ఆయా గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో కుక్కలను హతమార్చినప్పటికి ఇంకా కుక్కల బెడద తగ్గడం లేదు. ఇప్పటికైన వీధి కుక్కలను నియంత్రించి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది.



రుద్రూర్‌లో కుక్కల స్వైర విహారం

వ్యాక్సిన్ వేస్తున్నాం: రుద్రూర్ పశువైద్య అధికారి సంతోష్

ఆసుపత్రికి తీసుకొచ్చే పెంపుడు కుక్కలకు ఎప్పటికప్పుడు వ్యాక్సిన్ వేస్తున్నాం. వీధి కుక్కలకు వ్యాక్సిన్ ఇవ్వాలంటే కుక్కలను పట్టే వారు ఉండాలి. వీధి కుక్కలకు వ్యాక్సిన్ ఇవ్వడం కుదరడం లేదు. ఆసుపత్రికి తీసుకొచ్చే కుక్కలకు మాత్రం వ్యాక్సిన్ ఇస్తున్నాం. వ్యాక్సిన్ ఇచ్చిన కుక్క కరిచిన ఎలాంటి సమస్యలు రావు.

ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యేదెన్నడో?

- ఆర్థిక భారం మోయలేక ముందుకు రాని లబ్ధిదారులు
- ఒకేసారి పెద్దమొత్తంలో ఇళ్లు మంజూరు కావడంతో మేస్త్రీలకు డిమాండ్

సదాశివనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం వేచి చూసిన అనేకమంది లబ్ధిదారులకు ఆదిలోనే ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం అందించే రూ.5లక్షలు విడతల వారీగా అందుతాయన్న ఆశతో కొందమంది ముందుదకు కదలనీయక ఆశ వదులుకోలేక అయోమయంలో పడే పరిస్థితి తలెత్తుతుంది. మండలానికి 564 గృహాలు మంజూరు కాగా 257 గృహాలకు మాత్రమే మార్కింగ్ ఇవ్వడం జరిగింది. 106 గృహాలు బేస్మెంట్ వరకు నిర్మాణం చేపట్టి నిలిచిపోయాయి. ప్రయోగత్మాకంగా చేపట్టిన వజ్జేపల్లిలో ఒక వంద పైచిలుకు గృహాలు మంజూరు కాగా ఇప్పటివరకు 8గృహాలు మాత్రమే స్లాబ్ వరకు నిర్మాణాలు జరిగాయి. కేవలం నాలుగు గృహాలు మాత్రమే స్లాబ్ వేయడం జరిగింది. దీనిని బట్టి చూస్తే ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం ఎంత కష్టంగా మారిందో గృహాల నిర్మాణాల పరిస్థితి చేస్తేనే అర్థమవుతుంది. పూర్తిస్థాయిలో నిర్మాణాలు ఎప్పుడు జరుగుతాయో అనేది ప్రశ్నార్థకంగా మిగిలిపోతుంది.



వజ్జేపల్లిలో స్లాబ్ పూర్తయిన ఇల్లు

లబ్ధిదారుల అసలు కష్టాలు..

ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల కకోసం రూ.5లక్షలు మంజూరు చేసి మండలంలోని 564మంది లబ్దిదారులకు ప్రొసిడింగ్‌లు అందజేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇల్లు ప్రారంభించాలంటే బేస్మెట్ వరకు దాదాపు రూ.6నుంచి 7లక్షల వరకు ముందుగా పెట్టాల్సి ఉంటుంది. మండలంలో ఒకేసారి గృహాలు మంజూరు కావడంతో మేస్త్రీలకు డిమాండ్ పెరగడంతో ఒక్కో గృహానికి రూ.3లక్షల వరకు మేస్త్రీలకే చెల్లించాల్సి రావడం, ప్రభుత్వం బేస్మెట్ వరకు పూర్తికాగానే రూ. లక్ష అందించిన దాదాపుగా రూ.5 లక్షల వరకు అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మొత్తం ఇంటి ఖర్చు రూ.15లక్షల నుండి రూ.20లక్షల వరకు అవుతున్న ప్రస్తుతం ప్రభుత్వం అందించే రూ.5లక్షలు పోనూ మిగితా డబ్బులను లబ్దిదారులు అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దింతో ఇల్లు నిర్మించుకోవాల లేక అప్పుల పాలు కావాలా అనే అయోమయంలో అనేకమంది లబ్దిదారులు పడిపోతున్నారు.

గూడు లేని నిరుపేదలకు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇస్తే లబ్ధిదారులకు మేలు..

పూర్తిగా ఇల్లు లేక నిర్మించుకునే స్థోమత లేని పేద కుటుంబాలకు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇస్తే పేద వారు మరింత అప్పుల పాలు కాకుండా ప్రభుత్వం కాపాడుతున్నట్లు అవుతుందని అనేకమంది లబ్దిదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇల్లు ప్రారంభిస్తే డబ్బులు లేక బయట నుంచి వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి ఇల్లు నిర్మించుకుంటే మూలిగే నక్క పై తాటికాయ పడ్డ చందంగా పే దోళ్ల బతుకులు అవుతాయని అ యోమయం వ్యక్తం చేస్తున్నారు. 564గృహాలకు గానూ దాదాపు 12 మాత్రమే నిర్మాణ దశలో ఉండట మే దినికి ఉదాహరణగా చెప్పుకోవచ్చని లబ్దిదారులు అభిప్రాయపడుతున్నారు.

మండలకేంద్రంలో నిర్మిస్తున్న నమూనా గృహం ఇప్పటికీ అసంపూర్తి..

మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు నమూనా గృహం చేపట్టి రూ.5లక్షలతో ఇల్లు పూర్తి అవుతుందని లబ్దిదారులకు భరోస నింపడానికి తహసీల్దార్ కార్యాలయం సమీపంలోఏర్పాటు చేసిన ఇల్లు ఇప్పటివరకు పూర్తికాకపోవడం లబ్దిదారులన ఉమరింత ఆందోళనకు గురిచేస్తుంది. నూతన సాంకేతిక విధానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఒక్కో గ్రామంలో అన్ని ఇండ్లను కలిపి ఓకే కాంట్రాక్టర్‌కు ఇప్పించాలన్న ఆలోచన ఉన్నప్పటికీ ఆ ఇల్లు పూర్తికాక గ్రామాలలోని లబ్ధిదారులకు అవగాహన కల్పించలేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం ముందుకు సాగడం లేదన్నది లబ్ధిదారులు వేధిస్తున్న ప్రశ్న.



పూర్తి కానీ ఇందిరమ్మ ఇల్లు నమూనా

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అన్నిరకాల అవగాహన కల్పిస్తున్నాం.. - ఎంపీడీవో సంతోష్‌కుమార్



లబ్దిదారులకు అన్నిరకాల సూచనలు చేస్తూ ఇళ్ల నిర్మాణం కోసం పూర్తి సహాయ సహకారాలు అందజేస్తున్నాం. 257ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ చేయడం జరిగింది. లబ్దిదారులకు సరసమైన ధరలకు అందించడానికి ఇసుక కాంట్రాక్టర్లతో సంప్రదింపులు జరుపులై లబ్దిదారులకు అందే విధంగా కృషిచేస్తున్నాం. సమీప వాగుల నుంచి ఇసుక రవాణాకు తహసీల్దార్‌తో మాట్లాడి ఆ విధంగా కూడా చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులు ప్రభుత్వం సూచించిన దానికంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలన్న ఆలోచనతో ఉండటం వల్ల నిర్మాణాలు జాప్యం అవుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ ఏఈవలు ప్రత్యేక పర్యవేక్షణలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయడానికి కృషి చేస్తున్నాం.

అలంకార ప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

మోర్తాడ్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా, అలంకార ప్రాయంగా మారాయి. గ్రామీణ ప్రాంతంలోని యువతను క్రీడల్లో తీర్చిదిద్దడానికి, వారి నుంచి క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు వీటిని ఏర్పాటు చేశారు. మోర్తాడ్‌లోని దోన్‌పాల్ రోడ్డు, గోవింద్‌రెడ్డి కాలనీ వద్ద మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. కాగా పనులు మాత్రం జరగలేదు. ఈ పథకం జాతీయ ఉపాధిహామి నిధుల కింద చేపట్టారు. మండలంలోని తొమ్మిది గ్రామాలలో రూ. 8లక్షల 49వేలతో ఈ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. మైదానాలు మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ క్రీడా మైదానంలో మొక్కలు, చెట్లు పెరిగాయి. క్రీడా ప్రాంగణాలు గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడం వల్ల యువకులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మోర్తాడ్‌లోని గోవింద్‌రెడ్డి కాలనీలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం కొనుగోలుచేసిన భూమి ఉండడంతో అదే స్థలంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. క్రీడా మైదనాలలో ఖోఖో, వాలిబాల్ ఇతర ఆటల కోసం ఏర్పాటు చేయాలి. అంతేకాక వ్యాయమం చేసేందుకు పరికరాలు ఏర్పాటు చేయాలి. ఇలాంటివేమి ఏర్పాటు చేయకపోవడం వల్ల క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. నామమాత్రంగా భూమిని చదును చేసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైన ఈ క్రీడా ప్రాంగణాలను పట్టించుకొని క్రీడలు ఆడేందుకు అన్ని ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.



మోర్తాడ్‌లో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

గ్రామీణ యువతను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు తగిన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలని యువకులు కోరుతున్నారు.

గ్రామీణ యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలి..

-డి.శ్యాం, ఫిజికల్ డైరెక్టర్,జడ్పీహెచ్‌ఎస్, మోర్తాడ్




గ్రామాలలోని యువకులు క్రీడల పట్ల ఆసక్తి కలిగించేందుకు అవకాశాలు కల్పించాలి. వారి నుంచి నైపుణ్యాన్ని వెలికితీయాలి. ప్రభుత్వం అన్ని అవకాశాలు కల్పిస్తే జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారులుగా గుర్తింపు పొందే అవకాశం ఉంది.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీసుదర్శన మహాయజ్ఞం

నిజామాబాద్ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా లోకమంతా సుభిక్షంగా ఉండాలని లోక కల్యాణార్థం శ్రీవేద భారతి పీఠ సంస్థాపకుల ఆధ్వర్యంలో శ్రీ రుద్ర సహిత లక్ష్మి సుదర్శన మహాయజ్ఞం భక్తిశ్రద్ధలతో సాగింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్యనగర్ ఎస్‌వీఐ కాలనీలో నిర్వహించిన మహాయజ్ఞంలో ఉదయం వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో గోపూజ, పుణ్యాహవాచన, విశ్వక్సేన, గణపతి, గౌరీ, పుణ్యాహవచన, అఖండ దీపారాధన పూజలు నిర్వహించి సంప్రోక్షణం చేశారు. వేద పండితుల వేదమంత్రోచ్చరణలతో యాగశాల ప్రవేశం చేసి మంటప ఆరాధన, కలశ స్థాపన, యంత్ర ప్రతిష్ట, అగ్నిప్రతిష్ఠ, నవగ్రహ నక్షత్ర శ్రీరుద్ర సహిత లక్ష్మి సుదర్శనయాగం, జయాది హోమం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవేద భారతి పీఠ సంస్థాపకుల ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నప్రసాదంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, గురుచరణ్, తదితరులు పాల్గొన్నారు.

రామాయణ పుస్తక రూపంలో పెండ్లి పత్రిక

పెద్దకొడప్‌గల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఎవరైనా తమ ఇంట్లో వివాహ కార్యక్రమం నిర్వహిస్తే వివిధ రూపాలలో పెండ్లి పత్రికలు అచ్చువేసి బంధుమిత్రులను ఆహ్వానిస్తారు. ఈ పత్రికలు మొదటి పేజీలో దేవతల రూపంలో లేదా ఇతర రంగులలో ముద్రించి పత్రికలను పంచుతారు. అయితే దీనికి భిన్నంగా ఆలోచించి తన కుమారుడి పెండ్లి పత్రికలు గాయత్రీ రామాయణ పుస్తక రూపంలో ముద్రించారు పిట్లం మండల కేంద్రానికి చెందిన కోట నాగరాణి- రాజులు దంపతులు. తమ కుమారుడి పెండ్లి ఆగష్టు నెలలో ఉన్నందున వివాహానికి రావాలని రామాయణ పుస్తక రూపంలో పెండ్లి పత్రికలు ముద్రించి వివాహానికి రావాలని బంధు, మిత్రులను ఆహ్వానిస్తున్నారు. గత రెండు సంవత్సరాల కిందట కూడ రాజులు తన కూతురి వివాహం చేసే సమయంలో భగవద్గీత పుస్తక రూపం లో పత్రికలు అచ్చు వేయించారు. ఈ విషయంపై కోట రాజులను ప్రశ్నించగా కార్డుల రూపంలో పెండ్లి పత్రికలు అచ్చు వేయిస్తే వాటిని చూసిన అనంత రం ఎవరైనా పక్కన పెడతారని, అలా కాకుండా ఈ విధంగా భక్తికి సంబందించిన పుస్తక రూపంలో అచ్చువేయిస్తే పత్రిక చూడటంతో పాటు తమకు నచ్చిన సమయంలో భక్తిపుస్తకాలను చదువుతారనే ఉద్దేశ్యంతో రామాయణ రూపంలో పెండ్లి పత్రికలు అచ్చువేయించడం జరిగిందని తెలిపారు.



గాయత్రీ రామాయణ పుస్తక రూపంలో పెండ్లి పత్రిక



పుస్తకం మొదటి పేజీలో లిఖించిన పెండ్లి పత్రిక

'గిరిజనులకు అండగా ఉంటాం'



గిరిజనుల భూములను పరిశీలిస్తున్న దృశ్యం

పెద్దకొడప్‌గల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి తండాలో గల గిరిజన బిడ్డలకు అండగా నిలుస్తామని కాంగ్రెస్ పార్టీ జుక్కల్ ఎస్సీ సెల్ చైర్మన్ అరవింద్ పేర్కొన్నారు. ఆదివారం తండా పరిధిలో అటవీ అధికారులు దున్నివేసిన పంట భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా అటవీప్రాంతంలో గల భూములను గిరిజన బిడ్డలు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారని, అటువంటి భూములను అటవీ అధికారులు మొక్కలు పెట్టాడనే నెపంతో చేతికి వచ్చిన పంటను దున్ని వేయడం దుర్మార్గమన్నారు. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటను సాగుచేసిన బిడ్డలకు ఆర్థికంగా నష్టం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన బిడ్డలకు న్యాయం జరిగే వరకు తాను అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.

పెద్దమల్లారెడ్డిలో కరాటే పోటీలు



హాజరైన విద్యార్థులు

భిక్కనూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఇంటర్నేషనల్ ఒకినవా గోజుర్యూ కరాటే ఆర్గనేజేషన్ తెలంగాణ సంస్థ గ్రాండ్‌మాస్టర్ కామిండ్ల రాజయ్య(బ్లాక్ బెల్ట్ 7డాన్) ఆధ్వర్యంలో ఆదివారం కరాటే విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కామారెడ్డి, దోమకొండ, భిక్కనూరు, బీబీపేట, రాజంపేట, మెదక్ జిల్లా రామాయంపేట మండలాల నుంచి 255మంది విద్యార్థులు హాజరుకాగా వీరికి సీనియర్ మాస్టర్లు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. దీనిలో ప్రతిభ చూపిన 36మందికి బ్లాక్ బెల్ట్, 69 మందికి ఎల్లో బెల్ట్, 60మందికి గ్రీన్ బెల్ట్, 40మందికి బ్రౌన్ బెల్ట్, 50మందికి వైట్‌బెల్ట్ ప్రధానం చేశారు. ఈ మేరకు గ్రాండ్ మాస్టర్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటేలో ఉత్తమ శిక్షణ అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ మాస్టర్లు కామిండ్ల నవీన్, జీ.సిద్దరాములు, ఏ సిద్దరాములు, స్వామి, రాజేందర్, శ్యాం, సాయినాథ్‌గౌడ్, సంతోష్, చింటూ, స్వాతిక్, రోహిత్, హరిప్రసాద్, కుమార్, సాయిదీప్తి, సుభాష్, ఆయా మండలాల విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఇంటింటికీ మొక్కలు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడటౌన్ , జూలై 27(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ఆకాంక్ష మేరకు ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలలో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు గౌస్, పురుషోత్తం, పాషా, కాలనీవాసులు జ్ఞానేశ్వర్ రావు తదితరులున్నారు.

చలో కామారెడ్డిని విజయవంతం చేయాలి

కామారెడ్డి రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద సోమవారం మత్స్యకారుల ధర్నా సందర్భంగా నిర్వహించే చలో కామారెడ్డిని విజయవంతం చేయాలని టీఎంకేఎంకేఎస్ జిల్లా అధ్యక్షుడు దుర్కి గంగారాం తెలిపారు. తెలంగాణలో భూ మాఫియా చెరువులు, కుంటలు కబ్జా చేయడంతో మత్స్యజాతులకు చేపల పెంపకానికి వీలులేకుండపోతుందన్నారు. దీంతో మత్స్య సంపద తగ్గిపోయి మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని, మత్స్యకారుల సమస్యలపై నిరసన తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పెద్దఎత్తున మత్స్యకారులు పాల్గొనాలని ఈ సందర్భంగా కోరారు.

ఉగ్రవాయి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కామారెడ్డి రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్రవాయి గ్రామశివారులో గల ఉగ్రవాయి మైసమ్మ ఆలయంలో ఆదివారం అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, హారతి వంటి పూజ కార్యక్రమాలను వైభవంగా చేపట్టారు. ఉగ్రవాయి మైసమ్మను చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దర్శించుకుంటారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని వారు తెలిపారు.

సెల్ఫీ మోజులో పడి
ప్రాణాలు పోగొట్టుకోవద్దు

● పెద్దకొడప్‌గల్ ఎస్ఐ అరుణ్



మాట్లాడుతున్న ఎస్ఐ అరుణ్

పెద్ద కొడప్‌గల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నాలుగైదు రోజుల నుంచి కురుస్తున్న వానలకు మండలంలో ఏదైన గ్రామంలో చెరువులు, కుంటలు నిండే సమయంలో ప్రజలు అక్కడ సెల్ఫీ మోజులో పడి ప్రాణాలు కోల్పోవద్దని మండల ఎస్ఐ అరుణ్ ప్రజలకు హితవు పలికారు. వర్షాలకు వాగులు, వం కలు, చెరువుల్లోకి నీరువస్తే వాటిని చూడటానికి చాలామంది ఆసక్తి కనబరుస్తారని, అదే సమయంలో కొందరు సెల్ఫీ మోజులో పడి ప్రాణాలు పోగొట్టుకుంటారని గుర్తుచేశారు. దీంతో పాటుగానే ఎక్కడైనా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తే వాటిని దాటరాదని, అదే సమయంలో పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతే కాకుండా ప్రజలు విద్యుత్తు స్తంభాలకు దూరంగా ఉండాలని, శిథిలావస్థకు చేరుకున్న ఇండ్లలో ఉండకూడదని సూచించారు. దీంతో పాటుగానే అత్యవసర సమయాలలో వానలో ప్రయాణించే వారు హెల్మెట్ ధరించడంతో పాటు మెళ్లగా ప్రయాణం సాగించాలన్నారు. వర్షం కురిసే సమయంలో అత్యవస రం అయితేనే ప్రయాణం చేయాలని లేదంటే వాయిదా వేసుకోవాలని సూచించారు.

దళితులపై దాడి హేయమైన చర్య

● బీర్కూర్‌లో దళిత సంఘాల రాస్తారోకో



బీర్కూర్‌లో రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు

బీర్కూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దళిత బిడ్డ జ్యోతిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల కేంద్రంలోని కామప్ప చౌరస్తాలో దళిత సంఘాల నాయకులు ధర్నా చేశారు. దళితమహిళ జ్యోతిపై దాడి చేసిన నర్ర సాయిలు, అతడి అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహానాడు సంఘం డివిజన్ అధ్యక్షుడు మల్లూరి సాయిలు మాట్లాడుతూ బీర్కూర్‌కు చెందిన నర్ర సాయిలు అనే వ్యక్తి ఇదే గ్రామానికి చెందిన నల్లజేరు జ్యోతికి మాయ మాటలు చెప్పి వివాహం చేసుకుని ఒక బిడ్డను కన్నడని తెలిపారు. అనంతరం జ్యోతిని చిత్రహింసలకు గురిచేశాడని, తల్లీబిడ్డలను ఇంట్లోంచి బయటకు తన్ని తరిమేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల నర్ర సాయిలు వారి అనుచరులు కలిసి జ్యోతిపై దాడి చేశారన్నారు. దళిత బిడ్డ జ్యోతికి న్యా యం చేయాలని సాయిలు డిమాండ్ చేశారు. జ్యోతి, వారి కుటుంబసభ్యులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, జ్యోతిపై దాడి చేసిన నర్రసాయిలు, అతడి అనుచరులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని అన్నారు. జ్యోతికి ఆమె కుమారుడికి న్యాయం జరిగేలా అధికారులు చర్య లు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నసురుల్లాబాద్ మండల అధ్యక్షులు బాలసాయిలు, బీర్కూర్ మాల సంఘం నాయకులు కొరిమె రఘు, బాబయ్యా, విశాల్, బస్వంత్, శ్రీకాంత్, శంకర్, బాలరాజ్, శివ, వినోద్, ప్రవీణ్, సాయి, నవీన్, సాయిబాబా, లక్ష్మణ్, గోపి, శివకుమార్, బాలయ్య, జ్యోతి, శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డికి తరలివెళ్తున్న దృశ్యం

కామారెడ్డి సభకు తరలివెళ్లిన నాయకులు

బాన్సువాడ రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లంలోని అంబేద్కర్ సంఘం నాయకులు ఆదివారం కామారెడ్డి జిల్లాకేంద్రంలో జరిగే బహుజన అలయ్‌బలయ్ సభకు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. సభకు తరలివెళ్లిన వారిలో కమిటీ మాజీ చైర్మన్ నర్సింలు, మన్నె చిన్నసాయిలు, గంగారాం, సాయిలు, సురేష్, ఆనంద్, రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

'మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే'



లింగంపేటలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

లింగంపేట, జులై 27 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసలు నమోదు చేసి జైలుకు పంపుతామని ఎస్సై ప్రదీక్‌కుమార్ అన్నారు. ఆయన ఆదివారం లింగంపేటలో వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేని వాహనదారులకు, లైసెన్స్ లేకుండా వాహనాలు పడిపేవారికి, వేగంగా వాహనాలు పడిపేవారికి జరిమానాలు విధిస్తున్నామని పేండింగ్ చాలన్లు ఉంటే వాటిని వసూలు చేస్తున్నామని ఆయన తెలిపారు. మైనార్లకు వాహనాలు ఇవ్వరాదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ ఉన్నారు.

శివాలయంలో శ్రావణజ్యోతి ప్రారంభం



శ్రావణ జ్యోతి వెలిగించిన దృశ్యం

సదాశివనగర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమర్లబండ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆలయ పూజారి గిరిష్ పంతులు శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. గ్రామంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని శ్రావణ మాస ప్రారంభం నుండి 41రోజులు జ్యోతి నిర్విరామంగా వెలుగొందుతూ ఉండాలని ప్రారంభిస్తారు. 41రోజుల తర్వాత దేవుని పండుగ చేసి అన్నదాన కార్యక్రమాలు, తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు. అప్పటి వరకు ప్రతిరోరజు భజన కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగుతాయని పూజారి గిరిష్ పంతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమర్లబండ గ్రామప్రజలు పాల్గొన్నారు.

బోర్లం ఆది బసవేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



బసవేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బాన్సువాడ రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలోని ఆది బసవేశ్వర ఆలయంలో ఆదివారం భక్తులు బసవేశ్వరుడికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గురు సోమలింగ శివచార్య ఆధ్వర్యంలో హోమం కార్యక్రమాలతో పాటుగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకుమార్ అన్నపూర్ణ, ఉమాకాంత్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి సోమలింగ శివాచార్య మహారాజ్‌ను శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తులకు మా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీధర్, భక్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై కూలిన వృక్షం

● ఇబ్బందులు పడ్డ వాహనదారులు



లింగంపేటలో రహదారిపై నేల కూలిన వృక్షం

లింగంపేట, జులై 27 (ఆంధ్రజ్యోతి) : మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలో ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై భారీ మర్రివృక్షం నేల కూలింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెద్దమ్మ ఆలయం సమీపంలో రోడ్డుపై అడ్డంగా వృక్షం పడడంతో ఎస్సై దీపక్‌కుమార్ చెట్టును తొలగింపచేశారు. అనంతరం వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. రహదారికి ఇరువైపుల వందల సంవత్సరాల నాటి వృక్షాలున్నాయి. వాటిని కొందరు వ్యాపారులు, సమీప పంటపొలాల రైతులు కాల్చివేయడంతో అవి గాలికి వానకు నేల కూలుతున్నాయి.

బీబీపేటలో కంటి వైద్య శిబిరం



బీబీపేటలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

దోమకొండ, జూలై 27(ఆంధ్రజ్యోతి): బీబీపేట మండలకేంద్రంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ సైట్, సిద్దిపేట జిల్లాకేంద్రానికి చెందిన కృష్ణసాయి కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు బుచ్చు కృష్ణమూర్తి, పెద్ది శ్రీపతి, గడిల విజయ్‌కుమార్ 185మందికి కంటి పరిక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వీరిలో 54మందికి శస్త్రచికిత్సలు అవసరం కాగా సిద్దిపేట కృష్ణసాయి ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు నాగభూషణం తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ సైట్ నిర్వహాకులు హారిష్, క్లబ్ కోశాధికారి నాగభూషణం, మాజీ డిప్యూటీ గవర్నర్ విశ్వప్రసాద్, బాశెట్టి నాగేశ్వర్, నీల భైరయ్య, గాంధారి సిద్ధరాములు, హరిప్రసాద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సహాయం



బాధిత కుటుంబానికి సాయం, వస్తువులు అందజేస్తున్న నాయకులు

రామారెడ్డి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో రెండురోజుల క్రితం పారిశుధ్య కార్మికురాలు బాలరాజవ్వ భర్త రాజనర్సు అనారోగ్యంతో మరణించింది. చనిపోయిన విషయం తెలుసుకొని ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఆర్థికసాయం, వస్తువులు అందజేశారు. నారెడ్డి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి నేతృత్వంలో బాధిత కుటుంబానికి రెండు వేల ఆర్థికసహాయం, యాభైకిలోల బియ్యం అందజేశారు. మాజీ జడ్పీటీసీ అందుబాటులో లేకపోయినా మంచి మనసు తో స్పందించి అన్నారం కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా సహాయం అందించారు. కాంగ్రెస్ మండల కాం గ్రెస్ నాయకులు రగోతం రెడ్డి, సల్మాన్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఈదమ్మ ఆలయానికి విరాళం



ఈదమ్మ ఆలయంలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న టీపీసీసీ ప్రధానకార్యదర్శి

కామారెడ్డిటౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని ఈదమ్మ దేవాలయానికి రూ.2.70లక్షల విరాళాన్ని టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి పెద్ద చెరువు సమీపంలో రజక సంఘం సభ్యుల కోరిక మేరకు గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్, మొదటిఅంతస్తు స్లాబ్, మెట్లు, గర్భగుడి, గోపురం నిర్మాణం కోసం సొంతంగా నిధులు అందించామని తె లిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు బండారి శ్రీకాంత్, రజకసంఘం అధ్యక్షుడు నర్సన్న మహేష్, చాకికోటేశ్వర్, పండు శ్రీకాంత్, ఉపాధ్యాక్షులు రాజు, నరేష్,అశోక్, మహేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా కడుపు కోతలు

(5వ పేజీ తరువాయి)

నార్మల్ డెలివరీలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొన్నిచోట్ల వసతులు సరిగా లేకపోవడం బెడ్డులు సరిపడా లేకపోవడం, డాక్టర్ల కొరత, సిబ్బంది కొరత వల్ల డెలివరీలు చేయడం ఆలస్యం అవుతుండడంతో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తున్నారు. ఇలా వెళ్తున్న వారిని వదిలిపెట్టకుండా అవసరం లేకున్నా సిజేరియన్‌లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక మొదటి కాన్పు ప్రైవేట్ ఆసుపత్రిలో సిజేరియన్ చేసుకున్నాక అప్పుడు ఖర్చుపెట్టిన డబ్బులు ఎక్కువ కావడంతో రెండో కాన్పుకు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రెండో కాన్పుకు సిజేరియన్‌లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ప్రభుత్వ వైద్యులు పేర్కొంటున్నారు.

సిజేరియన్ల వల్ల కలిగే అనర్థాలు

సిజేరియన్‌లు చేయడం వల్ల మహిళల్లో పలు రకాల అనారోగ్య సమస్యలు తలెత్తె అవకాశముందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.సాధారణ డెలవరిలో పుట్టి చిన్నారుల కంటే సిజేరియన్లలో పుట్టి చిన్నారులకు అనేకరకాలైన సమస్యలు ఏర్పాడుతాయని అంటున్నారు.అదేవిధంగా శస్త్రచికిత్స జరిగేప్పుడు రక్తం ఎక్కువగా పోవడం వల్ల మహిళలకు ఆరోగ్యం విషయంలోఇబ్బందులు ఏర్పడడమేకాకుండా సాధారణ ప్రసవం అయినవారితో పోలిస్తే ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తుంది.మత్తులో ఉండడం వల్ల పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు ఇవ్వలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. మహిళలు శారీరకంగా,మానసికంగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవలసివస్తుంది.

ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో జరిగిన ప్రసవాలు

	ప్రభుత్వ		ప్రైవేట్	
	నార్మల్	సిజేరియన్	నార్మల్	సిజేరియన్
ఏప్రిల్	968	633	68	272
మే	546	716	45	267
జూన్	591	643	65	228

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దోమకొండలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

దోమకొండ, జూలై 27(ఆంధ్రజ్యోతి):సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా దోమకొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో కౌశికొరెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పాడి కౌశిక్‌రెడ్డి వెంటనే సీఎం రేవంత్‌రెడ్డికి క్షమాపణలు చెప్పి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్నారు. ఇకనైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని లేనియెడల తగినబుద్ది చెబుతామని హెచ్చరించారు. కౌశిక్‌రెడ్డిపై పోలీసులు వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తిరుమల గౌడ్, అబ్రబోయిన స్వామి, సీతారాం మధు, శ్రీకాంత్, రామస్వామిగౌడ్, నర్సయ్య, నల్ల శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, నర్సారెడ్డి, గోపాల్, సిద్దారెడ్డి, కొండ అంజయ్య, షమీ, సిద్దరాములు, రాజేందర్, రాములు, రమేష్, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ నెంబర్ ప్లేట్ కలిగిన ద్విచక్రవాహనదారుడిపై కేసు

కామారెడ్డిటౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఫేక్ నంబర్‌ప్లేట్ కలిగిన ద్విచక్రవాహనదారుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు. నిజామాబాద్ జిల్లా వినాయక్‌నగర్‌కు చెందిన చెరువుపల్లి రాహుల్‌రాజ్ అనే వ్యక్తి తన స్కూటిని నిజామాబాద్‌లో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే ఇతని వాహనం నంబర్‌ను కామారెడ్డికి చెందిన ఓ వ్యక్తి తన స్కూటీకి పెట్టి చలానాలకు గురికాకుండా, ఇతను నేరం చేసినట్లయితే దొరకకుండా తప్పించుకోవడానికి ప్రయత్నాలు చేస్తుండడంతో గుర్తించి పట్టుకున్నామని తెలిపారు. అసలు ఎందుకు ఆ వ్యక్తి రాహుల్‌రాజ్ స్కూటినంబర్‌ను తగిలించుకున్నాడనేది విచారణ చేసి పూర్తివివరాలు వెల్లడిస్తామని సీఐ తెలిపారు. ఇతరుల నంబర్‌ప్లేట్లు పెట్టుకుని తిరగరాదని, నం బర్ ప్లేట్‌లు లేకుండా వాహనాలు నడిపిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

బిచ్కుంద, జూలై 27(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడపరాదని బిచ్కుంద ఎస్ఐ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కందర్‌పల్లి గ్రామషైవేపై పోలీసులతో కలిసి ఎస్ఐ తనిఖీలు చేపట్టారు. ప్రతివాహనదారుడు ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. వాహనాలపై ట్రాఫిక్ చలాన్‌లు ఎప్పటికప్పుడు మీ సేవా కేంద్రాలలో చెల్లించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- మై బేబీ
ప్రియా 70	- జూనియర్
ప్రియా 35	- కొత్తపల్లిలో ఒక్కప్పుడు

బాన్సువాడ

మహేశ్వరి	హరిహార వీర మల్లు
వెంకటేశ్వర	కొత్తపల్లిలో ఒకప్పుడు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	180	220	240
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

